ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

# చిత్తూరు

జిల్లా వార్తలు

గురువారం 8 మే 2025






కుప్పంలో విజయోత్సవం జరుపుకుంటున్న ప్రజలు



పలమనేరులో నినాదాల హోరు

# త్రివిధ దళాలకు సలాం

కుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఉప్పొంగింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగించి వచ్చిన మన త్రివిధ దళాలకు సలాం చేసింది. కుప్పం పట్టణంలో బుధవారం జనసేన ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో మున్సిపల్ పార్కు వద్ద గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇదే కూడలిలో మానవహారంగా ఏర్పడి 'జై బోలో భారత్ మాతాకీ, మేరా భారత్ మహాన్' అంటూ నినాదాలు చేశారు. పాక్ భూమిలోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపి, అత్యంత సాహసంతో ఉగ్రవాద మూకలను తుదముట్టించిన త్రివిధ దళాలకు వీర వందనాలు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ సర్కారు పాక్‌పై తీసుకునే ఏ ప్రతీకార చర్యకైనా భారతీయుడు సంపూర్ణ ఆమోదం తెలుపుతాడని ప్రతిన బూనారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్‌తోపాటు పలువురు పార్టీ నాయకులు, జన సైనికులు, పట్టణంలోని యువత, కులమతాలకు అతీతంగా సామాన్య పౌరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### జాతీయ రహదారిపై జై భారత్ నినాదాలు

పలమనేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఆక్రమిత కాశ్మీర్‌లో వున్న ఉగ్రవాదుల స్థావరాలపై దాడిచేసి నేలమట్టం చేసిన భారత సైనికులకు పలువురు నీరాజనాలు పలికారు. పలమనేరులోని జాతీయ రహదారిపై టవర్ క్లాక్ వద్ద బుధవారం మధ్యాహ్నం తెలుగుదేశం, బీజేపీ శ్రేణులు, మాజీ సైనికోద్యోగులు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు జాతీయ జెండాలు పట్టుకొని జైభారత్ అంటూ నినాదాలు చేశారు.

# ప్రతిభకు ప్రశంసలు

## రాష్ట్రస్థాయిలో అవార్డులకు ఎంపికైన విద్యార్థులు వీరే

చిత్తూరు సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాప్ టెన్‌లో నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులను అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆశ్రమ, సాంఘిక, సంక్షేమ, హాస్టళ్లలో వుంటూ టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల, బెస్టు సబ్జెక్టు టీచర్ల, వార్డెన్ల, ప్రిన్సిపాళ్ల జాబితాను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. వీరిని ప్రభుత్వం సన్మానించనుంది.

టెన్త్ విద్యార్థుల్లో వసతిగృహాల విద్యార్థులు టి.విశ్వనాథ్ (తిరుపతి) 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచాడు.బి.హనుమంతు(వెంకటగిరి) 580 మార్కులు సాధించి ఏడవ స్థానంలో నిలిచాడు.పి.భావన(తిరుపతి) 577 మార్కులతో పదవ స్థానంలో నిలిచింది. కె.మహాలక్ష్మి( రాయలపేట,చిత్తూరు) 578 మార్కులతో తొమ్మిదవ స్థానంలో నిలిచింది.ఎ.శ్రీధర్(టి.సుండుపల్లి,అన్నమయ్య జిల్లా) 577 మార్కులతో పదవ స్థానంలో నిలిచాడు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో టెన్త్ టాపర్లుగా శ్రీకాళహస్తి నుంచి ఎం.కీర్తనాభాయ్ 583మార్కులతో సాధించి తొమ్మిదవ స్థానంలో, వెంకటగిరి నుంచి బి.లహరి 578 మార్కులతో పదవ స్థానంలో నిలిచింది.

ఇంటర్‌లో తిరుపతి జిల్లా వాకాడుకు చెందిన టి.ప్రభు ఎంఈసీ గ్రూపులో 922 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. పలమనేరుకు చెందిన ఎం.వైష్ణవి 918 మార్కులతో మూడవ స్థానంలో నిలిచింది. పుత్తూరులోని పి.శిరీష హెచ్‌ఈసీ గ్రూపులో 927 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలవగా, పీలేరుకు చెందిన జీకే హాసిని హెచ్‌ఈసీలో 913 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచింది. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినుల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టులోని ఎం.జోత్స్న బైపీసీలో 964 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలవగా, పలమనేరులోని టి.హర్షిత ఒకేషనల్ విభాగంలో 971 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచింది. అన్నమయ్య జిల్లాలోని జీఎస్‌డబ్ల్యుసీజీహెచ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలోని సి.పల్లవి ఒకేషనల్ విభాగంలో 981 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రాయచోటిలో ఎం.వెంకటేష్ ఒకేషనల్ (సెరికల్చర్)లో 971 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో శ్రీకాళహస్తి ఎస్‌ఓఈ కళాశాలలోని ఎం.భావజిబాయ్ బైపీసీలో 982 మార్కులు సాధించి ఐదవ స్థానంలో నిలవగా, శ్రీకాళహస్తి యూఆర్‌జేసీ (జీ)లోని వి.అనూష సీఈసీ గ్రూపులో 931 మార్కులు సాధించి తొమ్మిది, వి.స్నేహలత 928 మార్కులు సాధించి పదవ స్థానంలో నిలిచారు. హెచ్‌ఈసీ గ్రూపులో తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడు ఆర్‌జేసీ (బాయ్స్) బి.లక్ష్మీనరసింహ 930 మార్కులు సాధించి పదవ స్థానంలో నిలిచాడు.

### ● స్టేట్ మెరిటోరియస్ సబ్జెక్టు టీచర్ అవార్డులు

సత్యవేడులోని ఎం.వసుంధరదేవి (మ్యాథ్స్), జి.అనురాధ (బోటనీ), అన్నమయ్య జిల్లా బురకాయలకోట ఎస్.సుమియ (సివిక్స్), బి.కొత్తకోట ఇ.వి జయకుమార్ (కామర్స్) .

● బెస్టు హాస్టల్ వార్డెన్ అవార్డులు : మదనపల్లె నూలివేడు జీఎస్‌డబ్ల్యుటీహెచ్, తిరుపతి జిల్లా నాయుడుపేట ఎస్‌డబ్ల్యుజీహెచ్ నెం.2.

●బెస్టు ప్రిన్సిపాల్ అవార్డు

చిత్తూరు జిల్లా పూతలపట్టులోని ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈలోని ఎస్.కోటేశ్వరరావు ఎంపికయ్యారు. ఏపీ ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో బెస్టు నోడల్ ప్రిన్సిపాల్‌గా శ్రీకాళహస్తి ఏపీటీడబ్ల్యుయూఆర్‌జేసీ (జీ) లోని వై.దామోదర నాయుడు ఎంపికయ్యారు.

# పనిచేసే వారిని ప్రోత్సహిస్తా

- జూనియర్లనూ గౌరవిస్తా
- కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోం
- సత్యవేడు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్



సూళ్లూరుపేట వద్ద నిమ్మకాయల దండతో టీడీపీ శ్రేణుల స్వాగతం

సత్యవేడు, మే 7 (ఆంధ్రజ్యోతి): 'యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి పార్టీలో పనిచేసే వారిని ప్రోత్సహిస్తా. సీనియర్లతో సమానంగా జూనియర్లనూ గౌరవిస్తా' అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. సత్యవేడులో బుధవారం రాత్రి ఆయన నియోజకవర్గ టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎప్పుడు ఈ ప్రాంతానికి వచ్చినా ముందుగా కార్యకర్తలనే కలస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఈ సమావేశానికి వచ్చానన్నారు. నాయకుల చుట్టూ కాదు.. ప్రజల చుట్టూ తిరగాలని కార్యకర్తలకు సూచించారు. టీడీపీలో క్యాడర్‌కు అలకలు అనే జబ్బు ఉందన్నారు. పార్టీలో సమస్యలుంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్ణయాలు తీసుకునే క్రమంలో కొన్నిసార్లు సమయం పడుతుందన్నారు. అయితే కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయమూ తీసుకోమని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ తీసుకున్న నిర్ణయాలను అందరం గౌరవించి అమలు చేయాల్సిందేనని లోకేశ్ స్పష్టం చేశారు. ఇక మీదట పార్టీలో పదవులు, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులూ కావాలంటే తప్పనిసరిగా కుటుంబ సాధికార వారధులుగా పనిచేయాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే నేతలకే పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన నిమ్మకాయల చినరాజప్పను గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేశామని, స్కూలు టీచర్ అనితను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఇప్పుడు హోమ్ మంత్రిగా నియమించామని గుర్తు చేశారు. కలిశెట్టి అప్పలనాయుడు సామాన్య కార్యకర్త నుంచీ, కాల్వ శ్రీనివాసులు సాధారణ జర్నలిస్టు నుంచీ వచ్చిన వారేనన్నారు. అదే టీడీపీ గొప్పతనమని పేర్కొన్నారు. అందుకే ఉత్తమ కార్యకర్తలను గుర్తించి అవార్డులు ఇస్తున్నామన్నారు. కమిటీలను పకడ్బందీగా నియమించుకుని ముందుకు వెళదామన్నారు. తమ క్లస్టర్, యూనిట్, బూత్‌లపై మాత్రమే కార్యకర్తలు దృష్టి పెట్టాలని, ఇతరులను పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ నెల 14న జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో కార్యకర్తల సమస్యలను చర్చిస్తామన్నారు.



సత్యవేడు సభలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు

### పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే

పార్టీ అధ్యక్షుడి నుంచి కుటుంబ సాధికార సారథి వరకూ అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు. ఏడాది కాలంగా పార్టీ పెద్దగా కార్యక్రమాలు ఇవ్వలేదని, మహానాడు తర్వాత ఎవరినీ వదిలిపెట్టేది లేదని చెప్పారు. అహంభావాన్ని ప్రజలు తిరస్కరిస్తారంటూ.. వైసీపీ 151 నుంచీ 11 స్థానాలకు పడిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వైసీపీ నాయకుల తీరు ఇప్పటికీ మారలేదని, గతంలో లాగానే మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకుపోవాలని, దొంగ పేపరు, టీవీల తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు, శ్రీపతి బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి!

మంత్రి నారా లోకేశ్ పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అనుచరులు ధర్నాకు దిగారు. ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ఆందోళన చేపట్టారు. లోకేశ్ సత్యవేడు చేరుకోక ముందే సుమారు వంద మంది అనుచరులు ప్లకార్డులతో ధర్నా చేశారు. ఎమ్మెల్యేపై కేసు పరిష్కారమైనప్పటికీ సస్పెన్షన్ ఎత్తివేయకపోవడం అన్యాయమన్నారు. సత్యవేడు నియోజకవర్గంలో బయటి వారి పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. గ్రావెల్ వ్యాపారాలకు అడ్డు వస్తున్నారని దళిత ఎమ్మెల్యేని అణగదొక్కేందుకు అగ్రవర్ణాలు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. వారు మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు పోలీసులు అనుమతించలేదు.

# శ్రీసిటీలో నేడు ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు. బుధవారం సాయంత్రం జిల్లాకు చేరుకున్న మంత్రి సత్యవేడులో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. రాత్రికి అక్కడే బస చేసి గురువారం ఉదయం శ్రీసిటీ చేరుకుని ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. శ్రీసిటీలో భూములు కేటాయిస్తే రూ. 5001 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ప్లాంట్ నెలకొల్పుతామని ఎల్జీ సంస్థ గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్లాంట్ ద్వారా 1495 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రతిపాదించింది. అంతేకాకుండా మరో రూ.839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లు కూడా నెలకొల్పుతామని తెలిపింది. ఎల్జీ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్ ప్రభుత్వం నుంచీ అవసరమైన భూముల కేటాయింపు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడానికి హామీ ఇవ్వడంతో పాటు ఆ ప్రతిపాదన అమలుకు చొరవ తీసుకున్నారు. దీంతో మూడు దశలకూ కలిపి శ్రీసిటీలో ఆ సంస్థకు 450 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం గతేడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. పలు రాయితీలు, మినహాయింపులు సైతం ప్రకటించింది. తొలుత నిర్ణయించుకున్న షెడ్యూలు ప్రకారం ఎల్జీ సంస్థ ఈ ఏడాది జనవరిలోనే ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో ఆలస్యమైంది. ఇటీవల ఏర్పాట్లన్నీ పూర్తి కావడంతో శంకుస్థాపనకు నిర్ణయించారు. వాస్తవానికి ఎల్జీ పరిశ్రమకు ఇదే తేదీన సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసేలా తొలుత కార్యక్రమం ఖరారైంది. అయితే బిజీ షెడ్యూలు కారణంగా సీఎం పర్యటన మారింది. దీంతో ఐటీ మంత్రి నారా లోకేశ్ నేడు శంకుస్థాపన చేయనున్నారు.

# తగ్గిన ఉష్ణోగ్రతలు

## 18 మండలాల్లో వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడిన మార్పులతో బుధవారం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి.40 డిగ్రీలకు మించి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, బుధవారం 38 డిగ్రీలకు పడిపోయాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు భిన్న వాతావరణం ఉండగా, సాయంత్రం తర్వాత నుంచి ఈదురు గాలులు వీస్తూ వర్షాలు కురుస్తున్నాయి. మండలాలవారీగా శ్రీరంగరాజపురంలో 38.6డిగ్రీలు, సోమలలో 38.5, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 38.4, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల్లో 37.8, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 37.5, రొంపిచెర్లలో 37.0, బైరెడ్డిపల్లె, నింద్ర, చౌడేపల్లె, పాలసముద్రం, గంగవరం, ఐరాల, నగరి, పెద్దపంజాణి, పెనుమూరు, విజయపురం, యాదమరి మండలాల్లో 36.9, గంగాధరనెల్లూరులో 36.8, గుడుపల్లె, శాంతిపురం, వి.కోట మండలాల్లో 36.6, సదుంలో 36.3, కార్వేటినగరంలో 36.1, కుప్పంలో 35.8, రామకుప్పంలో 35.3, పలమనేరు, పుంగనూరు మండలాల్లో 34.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.కాగా గడిచిన 24 గంటల్లో 18 మండలాల్లో వర్షాలు కురిశాయి.శ్రీరంగరాజపురంలో 54మిమీ , పాలసముద్రంలో 43.2, గుడిపాలలో 36.2, చిత్తూరులో 35.4, బైరెడ్డిపల్లెలో 34.4, గంగవరంలో 31.8, నగరిలో 30.8, కార్వేటినగరంలో 26.4, వి.కోటలో 25.2, గంగాధరనెల్లూరులో 23.4, నింద్రలో 18.2, యాదమరిలో 14.4, తవణంపల్లెలో 8.2, పెనుమూరులో 7.2, విజయపురంలో 5.8, ఐరాలలో 4.2, వెదురుకుప్పంలో 2.2, శాంతిపురంలో 2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

# అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు అవగాహన కల్పించండి
- 'ఆపరేష్ సిందూర్' అనంతర పరిస్థితులపై సీఎం ఆదేశం



సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ట్రైనీ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' అనంతర పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం వర్చువల్ విధానంలో కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ , ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్ పాల్గొన్నారు.జిల్లాలో పౌర రక్షణపై అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్ తదితర ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో సమన్వయం చేసుకుని అన్ని రకాల అత్యవసర చికిత్సలు, మందులు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పరిశ్రమల్లోనూ ముందస్తు చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. తప్పుడు ప్రచారం ప్రజల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు.

## దండికుప్పంలో భూముల సర్వేపై

# రైతుల అభ్యంతరం

### ప్రతి రైతుకూ న్యాయం చేస్తామన్న ఎమ్మెల్సీ కంచర్ల



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, కడ పీడీ వికాస్

శాంతిపురం/రామకుప్పం, మే7(ఆంధ్రజ్యోతి):శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టుకు భూములిచ్చే రైతులందరికీ ప్రభుత్వం ద్వారా న్యాయం జరిపిస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ సీడీ వికాస్‌మర్మత్ హామీ ఇచ్చారు. శాంతిపురం మండలంలోని దండికుప్పం, సిద్దారెడ్లపల్లె, జీడిగుట్ల గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఎయిర్‌పోర్టుకు భూముల సేకరణ కోసం చేపట్టిన సర్వేపై అభ్యంతరం తెలిపారు. వైసీపీ నేతలు కొందరు కూడా అక్కడకు రావడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది.నిజానికి ఎయిర్‌పోర్టు భూములకు 90శాతం మంది రైతులు ఎటువంటి అభ్యంతరం తెలపడం లేదు. అయితే నష్ట పరిహారం పెంచి ఇవ్వాలన్న డిమాండు వారి నుంచి బలంగా విన్పిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం సేకరిస్తున్న భూముల్లో రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన కొందరు వైసీపీ నేతల భూములు కూడా ఉండడంతో వారు పలువురు రైతులను రెచ్చగొడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. బుధవారం రైతుల వెంట వారు కూడా వచ్చారన్న సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దండికుప్పంలో నెలకొన్న పరిస్థితులపై సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్‌మర్మత్ కూడా అక్కడకు చేరుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎయిర్‌పోర్టుకు భూములిచ్చే రైతులకు అన్యాయం జరగదని వారు భరోసా ఇచ్చారు. గతంలో ఇచ్చిన దానికన్నా అధికంగా నష్టపరిహారం అందించడమే కాకుండా, భూములిచ్చే ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తామని వారు రైతులకు హామీ ఇచ్చారు. అంతలో అక్కడకు శాంతిపురం మండల టీడీపీ నేతలు విశ్వనాథ నాయుడు, విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు చేరుకున్నారు. భూసర్వేకి రైతులు అభ్యంతరం చెప్పేలా ప్రోత్సహిస్తున్నారంటూ వైసీపీ నేతలతో వాగ్వాదానికి దిగారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటయితే కుప్పం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడమే కాకుండా సుమారు 40నుంచి 50వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని వైసీపీ నేతలకు సూచించారు. భూసేకరణ విషయంలో రైతులు సహకరించాలని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, కడ సీడీ వికాస్‌మర్మత్ కోరారు. కొందరు రైతులు వారిచ్చిన భరోసాతో సానుకూలంగా స్పందించగా, మరికొందరు విముఖత వ్యక్తం చేశారు. త్వరలోనే రైతులందరితో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామంటూ వారు అక్కడి నుంచి వెళ్ళారు.

## కోనేటిరాయుడి కల్యాణ వేడుక





పద్మావతి పరిణయోత్సవాల్లో రెండో రోజైన బుధవారం నారాయణగిరి ఉద్యానవనంలోని వేదికపై శ్రీదేవి భూ సమేత శ్రీనివాసుడిని కొలువుదీర్చి కల్యాణ సంబరాన్ని నిర్వహించారు. సాయంత్రం మలయప్పస్వామి అశ్వవాహనాన్ని అధిరోహించి సకల సార్వభౌమాధికార లాంఛనాలతో బయలుదేరి పరిణయోత్సవ మండపానికి వచ్చారు. వెంట స్వర్ణపల్లకిలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. తొలిరోజు తరహాలోనే ఉత్సవర్లకు ఎదుర్కోలు, పూలమాలలు మార్చడం, పూలబంతులాట, నూతన వస్త్రధారణ తదితర కార్యక్రమాలు పూర్తయ్యాక కొలువు నిర్వహించారు. శ్రీవారు దేవేరులతో కలిసి తిరుచ్చిలో ఊరేగుతూ రాత్రి 8.30 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## తిరుపతిలో పోలీసుల మాక్ డ్రిల్

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర' నేపథ్యంలో బుధవారం తిరుపతిలో పోలీసులు బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యాన అన్నమయ్య సర్కిల్ రోడ్డులో రిజర్వు పోలీసు బలగాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. ఉగ్రవాదులు అనుకోని సంఘటనలకు పాల్పడినా వారి నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఉగ్రవాదులు దాడులకు వచ్చిన సమయంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం.. లైట్లు ఆపేయడం చేయాలని డీఎస్పీ సూచించారు.



తిరుపతిలో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు



బస్సెక్కుతున్న మహిళను నెట్టి..

## బంగారు గాజులు కొట్టేశారు

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బస్సెక్కుతున్న 70 ఏళ్ల వృద్ధురాలిని నెట్టి చేతి గాజులు కొట్టేశారు. బుధవారం రాంభగీచ అతిథి గృహం బస్టాండు వద్ద రద్దీలో ఈ చోరీ జరిగింది. బాపట్ల జిల్లాలోని తుమ్మినేని గ్రామానికి చెందిన రవికుమార్ తల్లి లక్ష్మిని ముగ్గురు వెనుక నుంచి నెట్టడంతో ఆమె మెట్లమీద పడిపోయింది. వెంటనే ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు లాక్కుని పరుగుతీశారు. 50 గ్రాముల గాజులు చోరీ అయినట్టు రవికుమార్ తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా దుండగలను గుర్తించిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

## కారు ఢీకొని ఏఆర్ కానిస్టేబుల్ మృతి



ఢిల్లీ బాబు(ఫైల్ ఫొటో)

వడమాలపేట, మే 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం కదిరిమంగళం బైపాస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ ఢిల్లీబాబు (46) మృతిచెందారు. నాగలాపురం మండలం వినోబానగర్‌కు చెందిన ఈయన మంగళవారం రాత్రి తిరుపతిలో విధులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వడమాలపేట మీదుగా వెళ్లడానికి కదిరిమంగళం వద్ద రోడ్డు దాటుతుండగా వెంకటగిరికి చెందిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను తిరుపతి రుయాస్పత్రికి తరలించగా.. శ్వాస సమస్య ఏర్పడడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్‌ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు.

## ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

● రుయా సూపరింటెండెంట్ కూడా





బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రవిప్రభ, డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రవిప్రభ, రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఎస్వీఎంసీ.. రుయాస్పత్రి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని రవిప్రభ చెప్పగా.. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూస్తానని రాధ పేర్కొన్నారు.

## ఏటీఎం చోరులకు రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం తిరుపతి బాలాజీ కాలనీలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ దొరికిన ముగ్గురిలో ఒకరిని సబ్‌జైలుకు.. మరో ఇద్దరిని జువైనల్ హోంకు తరలించారు. వెస్ట్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా గురుఆయర్, చెన్నై అన్నానగర్‌కు చెందిన ఇద్దరు బాలురతో కలిసి అన్నానగర్‌కు చెందిన ముత్తు పాండ్యన్ ఈనెల 3వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇనుప రాడ్‌తో పీఎన్‌బీ ఏటీఎం పగులకొట్టడానికి ప్రయత్నించాడు. అక్కడి సీసీ కెమెరాల ద్వారా ముంబైలో ఉన్న బ్యాంకు కమాండ్ కంట్రోలు యూనిట్ సిబ్బంది గమనించి వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ లోకేష్ బాబు సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు మైనర్లు కావడంతో జువైనల్ హోంకు.. ముత్తుపాండ్యన్‌ను రిమాండ్‌కు తరలించారు.

## సదరన్ డిస్కం డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ



అయూబ్ ఖాన్, గురవయ్యను అభినందిస్తున్నసీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్) మే7(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కం డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, గురవయ్య బుధవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. వీరిని సీఎండీ కె.సంతోషరావు అభినందించారు. అధికారులు, జీఎంలు,ఈఈలు శుభాకాంక్షలు తెలిపారు.

## 18నుంచి చిత్తూరు ప్రీమియర్ లీగ్

తిరుపతి(క్రీడలు), మే 7(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్, ఏపీఎల్ తరహాలో క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఈనెల 18వ తేదీ నుంచి పది రోజుల పాటు చిత్తూరు ప్రీమియర్ లీగ్(సీపీఎల్)మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రికెట్ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 11న బిడ్డింగ్ ఏర్పాటు చేస్తామని, ఐపీఎల్ తరహాలో క్రీడాకారులను ఆయా స్పాన్సర్లు కొనుగోలు చేస్తారన్నారు. ఎస్వీయూ క్రీడా మైదానంలో ఈ నెల 18న పోటీలు మొదలవుతాయని, రోజుకు రెండు మ్యాచ్‌లు ఉంటాయని వివరించారు. 6 కెమెరాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. 17 నుంచి 35 ఏళ్ల వారికే అవకాశమన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు గిరిబాబు, శ్రీనివాసమూర్తి, సతీష్‌యాదవ్, శ్రీధర్‌కుమార్, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

తిరుపతి(ఆటోనగర్), మే7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం యశోదా నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఈ పోస్టర్లను బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆవిష్కరించారు. పాతికేళ్ల తర్వాత తిరుపతిలో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలు, పరిష్కారంపై చర్చ జరుగుతుందన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, మాధవ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

# పిడుగుపాటుకు ఇద్దరు గిరిజనుల మృతి



మురళి - శంకర్

శ్రీకాళహస్తి, మే 7(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్టీకాలనీలో బుధవారం వెలుగు చూసింది. ఎస్టీకాలనీకి చెందిన బావ బామ్మర్ది అయిన మురళి(50), శంకర్(36) వ్యవసాయ కూలీలు. చేపల వేటపైనా జీవనం సాగిస్తుంటారు. మంగళవారం కూలి పనుల కోసం వెళ్లిన వీరు రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఈ క్రమంలో ఎస్టీకాలనీ సమీపంలోని పంట పొలాల్లో మురళి, శంకర్ విగతజీవులుగా పడి ఉండగా గుర్తించారు. మంగళవారం సాయంత్రం పిడుగుపాటుతో వీరిద్దరు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావించి మృతదేహాలను ఇంటికి తరలించారు. బుధవారం సమాచారం తెలుసుకున్న వీఆర్వో శ్రావణ్ ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, రూరల్ సీఐ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలకు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. మురళికి భార్య, ఇద్దరు కుమారులు.. శంకర్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుకు బంధువులైన ఇద్దరు గిరిజనులు మృతి చెందడంతో ఎస్టీకాలనీలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి ఊరందూరు ఎస్టీకాలనీకి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



మురళి, శంకర్ మృతదేహాలు



బీఎన్‌కండ్రిగలో వర్షానికి తడిసిన మిరప కాయలను ఆరబెడుతున్న రైతులు

## గాలివాన బీభత్సం

● రాలిన మామిడి, మిరప

బుచ్చినాయుడుకండ్రిగ, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగ మండలంలో మంగళవారం రాత్రి గాలి,వాన బీభత్సం సృష్టించింది. మామిడి, మిరప రైతులకు భారీ నష్టం జరిగింది. 200 ఎకరాలలో మామిడి.. 20 ఎకరాలలోని మిరపపంట దెబ్బతింది. తడిసిపోయిన మిరపకాయలను రైతులు బుధవారం ఆరబెట్టుకున్నారు. అనేక గ్రామాలలో చెట్లు నేల కూలాయి. బీఎన్ కండ్రిగలో గాలి వానకు వినాయకమ్మ బొమ్మల షెడ్డు కూలి పోయింది. ట్రాన్స్‌కోకు రూ.3లక్షలకు పైగా తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలగా.. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకు ఒరిగాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడగా, బుధవారం డిస్కం అధికారులు సరఫరా పునరుద్ధరణ చేపట్టారు.

# తిరుమలలో పెట్రోలు బంకు లీజులోనూ అవినీతి

● వైసీపీ నేతల కోసం అప్పటి అధికారుల మాయ ● భానుప్రకాష్‌రెడ్డి ఆరోపణ

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమలను అంగుళం అంగుళం అమ్మే ప్రయత్నం చేశారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. తిరుమల ఆలయం ముందు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు తిరుమలలో జరిగిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. 2022 ఏప్రిల్‌లో చేసుకున్న ఒప్పందం ప్రకారం తిరుమలలో నడుస్తున్న ఐఓసీఎల్ పెట్రోల్ బంక్ నెలకు దాదాపు రూ.4 లక్షల వరకు టీటీడీకి అద్దె చెల్లిస్తుండగా, అదే ఏడాది మేలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌కు మాత్రం అదే తిరుమలలో నెలకు రూ.2.20 లక్షలకే కేటాయించారని తెలిపారు. ఐఓసీఎల్‌కి ఏడాదికి 3శాతం అద్దె పెంపు నిర్ణయం ఉండగా, హెచ్‌పీసీఎల్‌కు అద్దె పెంపు లేకుండానే 15 ఏళ్లకు లీజుకు ఇచ్చేశారని వివరించారు. అప్పటి వైసీపీ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ వ్యవహారంలో నెలకు దాదాపు రూ.25 లక్షలు చేతులు మారాయని ఆరోపించారు. స్వామి ఆదాయానికి గండి కొట్టిన ఈ అనుమతులను రద్దు చేయాలని బోర్డులో ప్రస్తవిస్తామన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలనేది తన డిమాండ్ అన్నారు.





జాతరలో అశేష జనవాహిని - నిమజ్జనానికి తరలివెళుతున్న పోలేరమ్మ

# వైభవంగా పోలేరమ్మ జాతర

నాయుడుపేట/టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తి పడమటి వీధిలోని కుమ్మరి ఇంటి నుంచి బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, భక్తుల నృత్యాల నడుమ బయలుదేరి శెట్టిపల్లివారి వీధిలోని అలంకరణ గుడికి బుధవారం వేకువజామున చేరుకుంది. అక్కడ నిశ్చయతాంబూలం అనంతరం బేరిపేట నుంచి వచ్చిన సప్పరంపై పోలేరమ్మ కొలువుతీరాక గ్రామోత్సవం నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చలువ పందిరిలో పోలేరమ్మను కొలువుతీర్చారు. అమ్మవారి ఎదుట భక్తులు కుంభాలు పోసి పూజలు చేశారు. విన్నమాల గ్రామస్తులు పొలికూడు చల్లారు. అనంతరం అమ్మవారి మెట్టినిల్లైన పాత పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడినుంచి సప్పరంపై అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగింపుగా రాజగోపాలపురానికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 12మందిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

## వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘ కొత్త కార్యవర్గం

తిరుపతి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ కె.లక్ష్మీకవిత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎన్.వినోద్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఏపీఎన్ శివకుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జడ్.నవీన్, సెంట్రల్ అసోసియేట్ నామినీగా డాక్టర్ వి.అశోక్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కె.సుధాకర్‌గౌడ్, డాక్టర్ కె.కుమార్, డాక్టర్ డబ్ల్యూ. దీప్తిస్వప్నలత ఎన్నికయ్యారు. వీరు రెండేళ్లపాటు కొనసాగుతారు.

## ఆర్‌డీఎస్ఎస్ పనులను సకాలంలో పూర్తి చేయండి

తిరుపతి(ఆటోనగర్), మే7(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజరు అశోక్ రాథోడ్ ఆదేశించారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దళవాయిపల్లి గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సదరన్ డిస్కం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఐదు జిల్లాల్లో జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. ఈ సమావేశంలో సీఎండీ కె.సంతోషరావు, డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్, సీజీఎం రమణాదేవి, జీఎం శ్రీనివాస్, ఈఈ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అశోక్ రాథోడ్

## ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి చేయండి

తిరుపతి(కలెక్టరేట్),మే7(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని కలెక్టర్, స్మార్ట్‌సిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. సెంటర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేశామని, అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని గడువు లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి 'మన పల్లె జానపదం జాతర'

తిరుపతి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్ర, శనివారాల్లో 'మన పల్లె జానపదం జాతర' నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఎస్వీయూ సెనేట్ హాల్లో ఏర్పాట్లు చేశారు. ప్రజా కళావేదిక, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే 300 మంది ప్రతినిధులు పేర్లు నమోదు చేసుకున్నారని, ప్రారంభ, ముగింపు సభలకు ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పాల్గొననున్నారని ప్రజా కళావేదిక ఛైర్మన్ అరవ జయపాల్, ఎస్వీయూ సాంస్కృతిక సమన్వయకర్త డాక్టర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

## వైసీపీకి వంతపాడే అధికారులను బదిలీ చేయండి

మంత్రి లోకేశ్‌కు టీడీపీ నేతల వినతి

సత్యవేడు, మే 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి వంత పాడే అధికారులను బదిలీచేయాలని పలువురు నాయకులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సత్యవేడుకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్ వారి సాధక బాధలను ఆసాంతం ఓపిగ్గా వింటూ సమాధానాలిచ్చారు. నాగలాపురం మండలానికి చెందిన ఆవుల రాంప్రకాష్ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో రెండు షుగర్ ఫ్యాక్టరీలు మూతపడి, బకాయిలు రాకుండా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు. కేవీబీపురానికి చెందిన లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం తనమీద కక్షగట్టి భూములను 22ఏ కింద చేర్చి వాటిని లాక్కొని నష్ట పరిహారం సైతం ఇవ్వకుండా లేఅవుట్‌లు ఏర్పాటు చేసిందని వాపోయారు. వరదయ్య పాళెంకు యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి, తడ మార్గంలో శిథిలావస్థకు చేరుకున్న పలు వంతెనలను పునర్నిర్మించాలని కోరారు. పిచ్చాటూరుకు చెందిన ఎంఎస్ రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నియోజకవర్గంలో కొంతమంది అధికారులు వైసీపీ నాయకులకే పనులు చేసిపెడుతున్నారని అలాంటి వారిని బదిలీ చేయాలని కోరారు. సత్యవేడుకు చెందిన కాశీ ప్రతాప్ రెడ్డి, పిచ్చాటూరుకు చెందిన నేత పద్మనాభరాజు మాట్లాడుతూ కార్యకర్తల సమస్యలు తీర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## అనుమతుల్లేని దుకాణం తొలగింపు

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కర్ణాటక సత్రాల్లో ఓ దుకాణాన్ని టీటీడీ రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. అనుమతులు లేకుండా దీనినిఏర్పాటు చేశారంటూ సోషల్ మీడియాలో రావడంతో ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈక్రమంలో టీటీడీ ఎస్టేట్ విభాగం ఏఈవో, సర్వేయర్, ఆర్‌ఐ బృందం బుధవారం ఆ దుకాణాన్ని తొలగించారు. దుకాణ సామగ్రిని ట్రాక్టర్‌లో తరలించారు. అనుమతులు ఉంటేనే దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని, కర్ణాటక సత్రాల అనుమతి ఉంటే సరిపోదని హెచ్చరించారు.

## 'అల్లూరి'కి ఘన నివాళి



అల్లూరి సీతారామరాజుకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా నాటి బ్రిటీష్ పాలకులను ఎదురించి పోరాడిన అల్లూరి సీతారామరాజు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సెట్విన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేసీ శుభం బన్సల్, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో ఆరుగురు జీబీ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తులు

తిరుపతి(వైద్యం), మే 7(ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన జీబీ సిండ్రోమ్ (గులైన్-బరీ సిండ్రోమ్) వ్యాధితో స్విమ్స్ న్యూరాలజీ విభాగంలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. వీరికి ప్రత్యేక వార్డులో వైద్యం అందిస్తున్నామని, ఎలాంటి ప్రాణాపాయమూ లేదని, ఏబీ పాజిటివ్ రక్తం ఎక్కించాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఈ గ్రూపు రక్తం స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో అందుబాటులో లేదని, దాతలు ముందుకు రావాలని కోరారు. కండరాల బలహీనత, తిమ్మిర్లు, శ్వాసకోశ సమస్యలు, కంటి కదలికల్లో ఇబ్బందులుంటే అవి జీబీ వైరస్ లక్షణాలు కావచ్చని, అలాంటి వారు వైద్యులను సంప్రదించాలన్నారు.

## దొంగను పట్టిచ్చిన ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరా

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లోకి చొరబడుతున్న దొంగను లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ కెమెరా పట్టిచ్చింది. గొల్లవానిగుంటలో కాపురమున్న ఒక కుటుంబం సెలవులు కావడంతో బయటకు వెళ్లారు. నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించిన దొంగ ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి తాళాలు పగులకొట్టి చోరీకి యత్నించాడు. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన లాక్డ్‌హౌస్ మానటరింగ్ కెమెరా ద్వారా ఈ విషయాన్ని గుర్తించిన కమాండ్ కంట్రోలు సిబ్బంది వెంటనే అలిపిరి పోలీసులను అప్రమత్తం చేశారు. హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి చోరీకి పాల్పడుతున్న దొంగను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్‌బాబు చెప్పారు.

## విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి



మృతి చెందిన తిరుపతి

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం స్థానిక కొరమేనుగుంటలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... నెల్లూరు గాంధీజీ కాలనీకి చెందిన 20 మంది జాతరలో భిక్షాటన చేసేందుకు రెండు రోజుల క్రితం తిరుపతికి వచ్చారు. కొరమేనుగుంట పోస్టల్ కాలనీలో ఉంటున్నారు. వీరిలో తిరుపతి(20) జాతర వేషం కోసం ఇంటి వద్ద వేప చెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా పైనున్న తీగలు తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. తోటి స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని రుయాకు తరలించి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## కరెంట్ తీగలతో వేటకు పాల్పడితే కఠిన చర్యలు

ఎర్రావారిపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగెలతో అటవీ జంతువులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ ట్రాన్స్‌కో ఈఈ చిన్న రెడ్డెప్ప అన్నారు. నెరబైలు సబ్ స్టేషన్‌లో బుధవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పరిధి కావడంతో నిరంతర కాపలా కష్టమైన పని అన్నారు. ఈఅటవీ ప్రాంతంలో కొంతమంది కరెంట్ తీగలతో వన్య ప్రాణుల వేటకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారముందన్నారు. పొలాల వద్ద అనుమానాస్పదంగా వేటకు తిరుగాడే వ్యక్తుల వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో చిన్నగొట్టిగల్లు ఈఈ రమేష్ బాబు ,ఎర్రావారిపాలెం ఎఈ జ్యోతిప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డీపీటీవో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆర్టీసీ), మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా వెంకటరావు గురువారం ఉదయం 11గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై ప్రజా రవాణా వ్యవహారాలపై చర్చించనున్నారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు 301 మంది గైర్హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాత పరీక్షలకు 610 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 610మంది హాజరయ్యారని, 301మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.



# అసలూ వడ్డీ కట్టాల్సిందే

**పంటరుణాల రెన్యువల్‌పై బ్యాంకర్ల మెలిక**

**విధిలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు**

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల పేరుతో పలువురు బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని ఆ సొమ్మును ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు.రుణాలు ఇలా దుర్వినియోగం కావడంపై దృష్టి సారించిన రిజర్వుబ్యాంకు(ఆర్బీఐ) ఇటీవల బ్యాంకర్లకు నూతన మార్గదర్శకాలు జారీచేసింది. పంటసాగు చేసే భూమి ఉన్న ప్రాంతాల్లోని బ్యాంకులే రుణాలివ్వాలనేది అందులో ఒకటి. ఒకవేళ భూమి ఒక చోట ఉండి, రైతు మరో చోట నివసిస్తున్న సందర్భంలో ఆ నివాసప్రాంతంలోని బ్యాంకు బంగారం తాకట్టు పెట్టుకుని రుణం ఇస్తే, ఆ మొత్తాన్ని ఆ భూమిలో ఆ పంట సాగుకే వినియోగిస్తున్నట్లు ఆ రైతు రుజువు చూపాల్సి వుంటుందనేది మరొకటి. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆర్బీఐ ఆదేశించింది. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాన్ని ఏడాది లోగా తిరిగి చెల్లించాలన్న నిబంధనను అన్ని బ్యాంకులూ అమలు చేస్తున్నాయి. వడ్డీ మాత్రమే కడితే కుదరదని ... అసలు కూడా కట్టేసి, మొత్తం రుణఖాతా మూసేయాలని స్పష్టం చేస్తున్నాయి. అవసరమైతే మళ్ళీ తాకట్టుపెట్టి కొత్త రుణం తీసుకోవాలని బ్యాంకర్లు చెబుతున్నారు.

**● అదనంగా వస్తుందని ఆశ**

బ్యాంకులో బంగారం తాకట్టుపెట్టుకుని ఇచ్చే రుణాలకు ఏటా తొమ్మిదిశాతం వడ్డీ వసూలు చేస్తుండగా... వ్యవసాయం పేరుతో తీసుకుంటే అందులో 0.25 శాతం రాయితీ లభిస్తోంది. పైగా వ్యవసాయం పేరుతో తీసుకుంటే బంగారం విలువలో 80నుంచి 85 శాతం సొమ్ము రుణంగా ఇస్తున్నారు. వ్యవసాయేతర అవసరాల కోసం బంగారం తాకట్టు పెడితే కొన్ని బ్యాంకులు 65శాతం మాత్రమే సొమ్ము ఇస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పట్టణప్రాంతాల్లో ఏటా సుమారు 8వేల నుంచి 10 వేల మంది వ్యవసాయ అవసరాల పేరుతో బంగారం తాకట్టుపెట్టి రూ.200 కోట్లకు పైగా రుణాలు తీసుకుంటున్నారు. అయితే ఈ సొమ్మును పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు సమాచారం.

**● రెండు సీజన్లలో రూ.12వేల కోట్లు**

జిల్లాలో వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులన్నీ కలసి 28కి పైగా ఉన్నాయి. ఇందులో అర్బన్ ప్రాంతాల్లో 51, సెమీ అర్బన్‌లో 62, రూరల్‌లో 131 వెరసి 244 శాఖలు ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో 2024 - 25లో 10,976.27 కోట్లు వ్యవసాయ రుణంగా ఇవ్వాలన్న లక్ష్యానికి మించి జిల్లా బ్యాంకర్లు 12,368.71 కోట్లు పంట రుణాలు అందించారు.

**● వడ్డీ రాయితీ పొందుతూ**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలాదిమంది రైతులు వివిధ బ్యాంకుల్లో రూ. కోట్ల మేర పంటరుణాలు తీసుకుంటున్నారు. ఏడాదిలోపు సకాలంలో చెల్లించేసి 4శాతం వడ్డీ రాయితీ పొందుతున్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు పంటరుణాలను పావలా వడ్డీకే బ్యాంకర్లు ఇస్తుండగా, పట్టాదారు పాసుపుస్తకాలు, 1బీ అడంగళ్ తదితర పత్రాలను చూపించి బంగారం తాకట్టుపై బ్యాంకులో రుణాలు పొందుతున్నారు.కొన్ని బ్యాంకులు పంటరుణాల లక్ష్యాలను అధిగమించేందుకు బంగారం తాకట్టుపై రుణాలు ఇస్తుండగా, మరి కొన్ని బ్యాంకులు సాధారణ రుణాలు ఇస్తున్నాయి. రూ.లక్ష విలువ చేసే బంగారానికి రూ.80 వేల వరకు రుణాన్ని 9శాతం వడ్డీ రేటుతో మంజూరు చేస్తున్నాయి. దిగుబడులు లేక ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న తమను ఆర్బీఐ నిబంధనలంటూ బ్యాంకర్లు ఇబ్బందుల పాల్జేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. పంట సాగుకోసం తీసుకున్న రుణాలను వడ్డీతో పాటు అసలు చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వడ్డీయే కట్టలేని పరిస్థితిలో వుంటే అసలు కూడా చెల్లించాలని బ్యాంకర్లు ఖచ్చితంగా చెబుతుండడంతో గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నామంటున్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు ఇదే అవకాశమని బ్యాంకుల వద్దే తిష్ట వేస్తున్నారు. రెన్యువల్ మొత్తం రైతుల ఖాతాలో జమయిన వెంటనే వడ్డీ వ్యాపారులకు తిరిగి చెల్లించాలి. ఇందుకుగాను కొన్ని ప్రాంతాల్లో వారానికి రూ.లక్షకు రూ. 2వేల నుంచి రూ.5వేల వరకు ముందుగానే వసూలు చేస్తున్నారు.

## రూ.92 కోట్లతో అభివృద్ధి పనులు

**● గంగ జాతర ఏర్పాట్లకు రూ.42 లక్షలు**

**● కుప్పం మున్సిపల్ సమావేశంలో ఆమోదం**

కుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో రూ.92 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈనెల 14వ తేదీనుంచి 21వ తేదీదాకా జరుగనున్న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లకోసం రూ.42 లక్షలను కేటాయించారు. ఆయా అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీర్ఘకాలం తర్వాత కుప్పం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ వి.సెల్వరాజ్ అధ్యక్షతన జరిగింది. గత నెల 28వ తేదీన జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో గెలుపొందిన సెల్వరాజ్ బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు 15 అంశాలతో కూడిన అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను కొన్నింటిని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజావసరాలు, సమస్యలు ఏవైనా ఉంటే రాతపూర్వకంగా కౌన్సిల్‌కు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్మన్ సెల్వరాజ్‌కు, కమిషనర్ వి.శ్రీనివాసరావుకు సూచించారు. సమన్వయంతో కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కౌన్సిల్‌కు సూచించారు. అర్ధగంటపాటు మాత్రమే జరిగిన సమావేశం ఉదయం 11.30 గంటలకల్లా ముగిసిపోయింది.

## నాటు బాంబు పేలి బాలుడికి గాయాలు



గాయపడిన లోహిత్

యాదమరి, మే 7 (ఆంధ్రజ్యోతి):యాదమరి మండల పరిధిలోని కొత్తూరు ఆదిఆంధ్రవాడలో బుధవారం సాయంత్రం నాటు బాంబు పేలడంతో ఓ బాలుడికి గాయాలయ్యాయి.గ్రామానికి చెందిన కృష్ణయ్య భార్య తులసి తన కుమారుడు లోహిత్ (7)తో కలిసి మేకలు మేపేందుకు గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్ళారు. అక్కడ వన్యప్రాణుల కోసం వేటగాళ్ళు ఏర్పాటు చేసిన నాటు బాంబు కన్పించడంతో ఏదో అనుకుని లోహిత్ దాన్ని తీసి దూరంగా విసిరేయబోయాడు. ఈ క్రమంలో లోహిత్ చేతిలోనే బాంబు పేలడంతో అతని ఎడమ చేతి బొటనవేలు, చూపుడు వేలికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం లోహిత్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారించి తగు చర్యలు చేపడుతామని ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు.

## జగమర్ల గ్రామాభివృద్ధికి చేయూత ఇవ్వండి

**● అధికారులకు డీఆర్వో సూచన**



చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా పలమనేరు మండలం జగమర్ల గిరిజన గ్రామాభివృద్ధికి అధికారులందరూ కృషిచేయాలని డీఆర్వో మోహన్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ ఈ పథకం కోసం ఎంపిక చేసిన జగమర్ల ఎస్టీ గ్రామంలో 110 గిరిజన కుటుంబాలు ఉన్నాయని అన్నారు. వీరందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలమనేరు మండలస్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర, ఎస్ఎస్ఏ పీవోఎం వెంకట్రమణ, ట్రాన్స్‌కో డీఈ చిన్నబ్బ, పంచాయతీరాజ్ డీఈ అనిత, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కోటపల్లెలో ఏనుగుల గుంపు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోకి 13 ఏనుగుల గుంపు మళ్లీ ప్రవేశించి పంటలను ధ్వంసం చేశాయి. కొన్నాళ్లుగా ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తున్నా పంట నష్టం అంతంతమాత్రంగానే ఉండేది. అయితే మంగళవారం రాత్రి ఏకంగా 13 ఏనుగుల గుంపు మామిడిచెట్లపై ప్రతాపం చూపడంతో మామిడికి అపారనష్టం జరిగింది. మామిడిపంట కోతకు వచ్చే సమయంలో మండలంలోకి 13 ఏనుగుల గుంపు చేరుకోవడంతో ఇక మామిడిచెట్ల ధ్వంసం ఆగే పరిస్థితి కనిపించేలా లేదు. దీంతో మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొంత కాలంగా చంద్రగిరి మండలం భీమవరం సమీపంలోని అడవిలో ఉన్న 13 ఏనుగుల గుంపు రెండు రోజుల క్రితం పులిచెర్ల మండలం వైపు అడుగులు వేశాయి. అయితే ఏనుగుల గుంపును ఇటువైపు రాకుండా అటవీశాఖ సిబ్బంది చేసిన కట్టడి ప్రయత్నాలు ఫలించలేదు. భీమవరం, పనపాకం, మంగళంపేట అటవీ ప్రాంతాలను దాటుకొని పులిచెర్ల మండలంలోని గానుగపెంట అటవీ సెక్షన్ పరిధిలోని తూర్పు విభాగం అటవీప్రాంతానికి చేరుకున్నాయి. మంగళవారం రాత్రి పాళెం పంచాయతీ కోటపల్లి సమీపానికి చేరుకున్న 13 ఏనుగుల గుంపు అరుపులు పెట్టడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ ఏడాది కూడా మామిడి పంటలపై ఏనుగుల గుంపు దాడులను ఎవరూ ఆపలేరని నిట్టూర్పు విడిచారు. కోటపల్లిలోని రైతులు భాస్కర్‌నాయుడు, వెంకట్రామనాయుడు, సుబ్రహ్మణ్యం, జూపల్లిలోని రైతు కళావతికి చెందిన మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. మామిడి కాయలను నేలరాల్చాయి. అనంతరం చాకలికోన, చలం అటవీప్రాంతంలోకి చేరుకున్న ఏనుగుల గుంపు బుధవారం అంతా అక్కడే మాటు వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు.

## పాఠశాలల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి

**● డీవైఈవో ఇందిర**



డీవైఈవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

చిత్తూరు సెంట్రల్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డివిజన్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు డీవైఈవో ఎస్.ఇందిర తెలిపారు. పాత కలెక్టరేట్‌లోని చిత్తూరు డివిజన్ కార్యాలయంలో బుధవారం డీవైఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో, హెచ్ఎం, ఎస్టీయూ, స్కూల్ అసిస్టెంట్లు, ఇతర సంఘాల నేతలు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. డీవైఈవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఖాళీగా ఏర్పడిన ఈ పోస్టుకు సీనియారిటీ జాబితా ఆధారంగా రొంపిచెర్ల ఎంఈవోగా పనిచేస్తున్న ఎస్.ఇందిరకు డీవైఈవో ఎఫ్ఏసీగా రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ నియమించిన విషయం తెలిసిందే. డీవైఈవో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇందిర మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పాఠశాలలపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎంఈవోలు, హెచ్ఎంలు సైతం వారి పరిధిలోని పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంతో పాటు పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా చూస్తానని చెప్పారు. ఇప్పటికే తరల్ కార్యక్రమంలో ఇలాంటి విద్యార్థులను గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. టెన్త్‌లో ఫెయిలైన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నారని, సెలవుల నేపథ్యంలో ఆయా సబ్జెక్టు టీచర్లు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు సైతం నిబంధనలను పాటించాలని సూచించారు.

## శ్రీదుర్గ మృతిపై నేడు ఎక్స్‌పర్ట్స్ కమిటీ విచారణ

చిత్తూరు రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి శ్రీదుర్గ మరణంపై ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణకు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తన కుమార్తె మృతి చెందిందని శ్రీదుర్గ తండ్రి షణ్ముగం చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణకు కమిటీ వేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ నెల 8న ఈ కమిటీ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి జరిగిన విషయాలపై విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. తిరుపతి రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన డాక్టర్లతో విచారణ కమిటీని నియమించారు.

## రాజన్న ఫౌండేషన్ తరపున అంబులెన్స్ వితరణ



చిత్తూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు అంబులెన్స్‌ను బుధవారం వితరణ చేశారు. అంబులెన్సును కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న ఫౌండేషన్ ద్వారా సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి రూ.35 లక్షల విలువ చేసే అంబులెన్స్, పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట పాఠశాలల అభివృద్ధికి రూ.15 లక్షలు.. మొత్తం రూ.50 లక్షలు అందించడం అభినందనీయమన్నారు. అంబులెన్స్‌లో అడ్వాన్స్ లైఫ్ సపోర్టు, సీఆర్‌పీ సౌకర్యం ఉన్నాయన్నారు. జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ మాట్లాడుతూ పూతలపట్టు - తిరుపతి మధ్య ప్రతిరోజు అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు రాజన్న ఫౌండేషన్, అమరరాజ సంస్థ, అమరా ఆస్పత్రి సంయుక్తంగా జిల్లాకు అడ్వాన్స్ లైఫ్ సపోర్టు కలిగిన అంబులెన్స్ వితరణ చేయడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. అమర ఆస్పత్రి ఎండీ రమాదేవి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తన పుట్టినిల్లు అని, అత్యవసర సేవలు అందించడంలో అమరా ఆస్పత్రి తరపున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆస్పత్రిలో కలియతిరిగారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషెంట్లకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు.

**● భారత ఆర్మీకి అభినందనలు**

పాక్ తీవ్రవాద చర్యలకు బదులిస్తూ భారత్ చేసిన వైమానిక దాడులకు చిత్తూరు జిల్లా తరపున చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు. తీవ్రవాదాన్ని తరిమికొట్టడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం, భారత సాయుధ దళాలు తీసుకుంటున్న చర్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి, ప్రభుత్వాస్పత్రి ఎంఎస్ ఉషశ్రీ, అపోలో హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 79మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 79మందికి మార్చి నెల జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.36లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతి నెలా 1నుంచి 17వ తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు, వారి సహాయకులకు రూ.3 వేలు చొప్పున జీతం ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా ఏప్రిల్ నెలలో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 79మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

## కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

**● సచివాలయాల్లో ఏడు రకాల సేవలు పునఃప్రారంభం**

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి):రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది.గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జిల్లాలో ప్రస్తుతమున్న 5.36 లక్షల కార్డుల్లో సుమారు 17 లక్షల మంది కుటుంబ సభ్యులున్నారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం వద్ద కొత్త కార్డుల కోసం 8వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇప్పుడు వచ్చే దరఖాస్తులన్నీ పరిశీలించి ఒకేసారి కొత్త కార్డులు జూన్‌లో జారీచేయనున్నారు.క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులు జారీచేస్తారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆరునెలల రేషన్ వివరాలు తెలుసుకోవచ్చు.కొత్త రేషన్ కార్డు పొందాలన్నా, కార్డులో పేరు మార్చుకోవాలన్నా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే జూన్ 7వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కొత్త బియ్యం కార్డులతో పాటు కుటుంబ విభజన, కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవచ్చు.ఈకేవైసీ కాని రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పునకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బియ్యం కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు రైస్ కార్డు సరెండర్ చేసుకునే వెసులుబాటు, చిరునామా మార్పు, తప్పుల దిద్దుబాట్లు, ఆధార్ సీడింగ్ వంటి వాటికి అవకాశం కల్పించినట్లు జేసీ విద్యాధరి పేర్కొన్నారు. ఈ సేవలు గతంలో ఆమోదించిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్ఓపీ) ప్రకారం అందించనున్నట్లు జేసీ తెలిపారు.

## ఏ విచారణకైనా సిద్ధం : కరుణ

తిరుపతి(జీవకోన), మే 7 (ఆంధ్రజ్యోతి): 'నా మీద ఏ విచారణ అయినా చేయించుకోవచ్చు. నేను ఎక్కడా భూములను ఆక్రమించలేదు. అలా పొరంబోకు భూములుంటే ఆనందంగా తీసుకోవచ్చు' అని వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీరు భూములు ఆక్రమించారంటూ ప్రభుత్వానికి విజిలెన్స్ శాఖ నివేదిక అందించడంపై ఎలా స్పందిస్తారంటూ ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ప్రభుత్వ చర్యలపై స్పందిస్తున్న తనపై అవినీతి ఆరోపణలు చేసి బలహీన పరచాలన్న కుట్రలో భాగంగా ఇదంతా జరుగుతోందన్నారు. కాగా అలిపిరి సమీపంలో ఏపీ టూరిజం అథారిటీకి చెందిన భూమిని టీటీడీకి కేటాయించినందుకు బదులుగా ఆ సంస్థకు మరో చోట 35 ఎకరాల టీటీడీ భూమిని కేటాయిస్తూ బోర్డు నిర్ణయం తీసుకోవడాన్ని కరుణాకరరెడ్డి తప్పుబట్టారు.అలిపిరికి అత్యంత సమీపంలో ఉన్న స్థలాన్ని టూరిజం శాఖకు ఇవ్వడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు.

## అల్లూరి సేవాతత్వాన్ని ఆదర్శంగా తీసుకోండి



చిత్తూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా ఎస్పీ మణికంఠ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవ త్యాగి అల్లూరి అన్నారు. పోలీసు వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరూ అల్లూరి సేవాతత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల హక్కులను కాపాడే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్ని కృష్ణ, మహబూబ్ బాషా, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి గంగజాతరలో మొదలైన వేషాల సందడి





తిరుపతి(జీవకోన), మే 7 (ఆంధ్రజ్యోతి):శరీరమంతా నాముకొమ్ము పూసుకుని... రేళ్ల కాయలు, మల్లెపూల మాలలు ధరించిన గంగమ్మ భక్తులు బైరాగి వేషంలో సందడి చేశారు.తిరుపతి గంగజాతరలో మొదటిరోజైన బుధవారం భక్తులు బైరాగి వేషంలో గంగమ్మను దర్శించుకున్నారు. ముందుగా వేశాలమ్మ,తాళ్లపాక పెద గంగమ్మలను దర్శించుకున్న అనంతరం తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వచ్చి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. బైరాగి వేషంలో భక్తులు ఇంటి నుంచి బూతులు తిడుతూ, చిందులేస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి విశ్వరూపం ముందున్న ఉప్పువీరాన్ని కర్రలతో కొడుతూ ప్రణమిల్లారు. ఇక, తాతయ్యగుంట గంగమ్మ సోదరిలుగా పూజలందుకుంటున్న వేశాలమ్మ, తాళ్లపాక పెదగంగమ్మ, అంకాళమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, నేరెళ్లమ్మ ఆలయాల్లోనూ జాతర సందడి కనిపించింది.

**నేడు బండవేషం**

గురువారం భక్తులు శరీరమంతా రక్తం చిందినట్టు కుంకుమ రాసుకుని కాటుకబొట్లు, తెల్లటి పూలు చుట్టుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. వయో పరిమితిలేకుండా బండవేషాన్ని భక్తులు వేస్తారు.



## నంది వాహనంపై మృత్యుంజయేశ్వరస్వామి చిద్విలాసం



నంది వాహనంపై ఊరేగుతున్న మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఆరో రోజు నంది వాహనంపై ఆది దంపతులు విహరించారు. గురువారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమార స్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. నంది వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింప చేసి ప్రత్యేకంగా పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళలు స్వామివారికి దివ్వెలు, దీపాలు సమర్పించారు. మంగళ వాయిద్యాల, చెక్క భజనలు, కోలాటలు నడుమ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాగిళ్ల రామనాథం కుటుంబ సభ్యులు, కేఆర్ మోహన్‌రాం, చంగల్రాయప్ప, నగేష్, అంజన్‌కుమార్ ఉభయ దారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి

పలమనేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని పలమనేరు పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి కోరారు. బుధవారం పలమనేరు పెన్షనర్ల సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన డీఏలు చెల్లించాలని, 12వ పీఆర్సీ నియామకంలో జరుగుతున్న జాప్యం కారణంగా తాత్కాలిక భృతి ఇవ్వాలన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘ నాయకులు సిద్దమనోహర్, సుబ్రహ్మణ్యం, త్యాగరాజు, వెంకటరమణ, సుబ్బన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సంఘ నాయకులు

పుంగనూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్థంతి వేడుకలను పుంగనూరులో క్షత్రియ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఓ మండపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అల్లూరు సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన యుగ పురుషుడుగా పేర్కొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు భక్తవత్సలరాజు, రెడ్డెప్పరాజు, సుబ్రహ్మణ్యంరాజు, లక్ష్మణరాజు, చిన్నబాబు, భాస్కర్‌రాజు, జ్యోతిరాజు, జగదీష్‌రాజు, సుదర్శనరాజు, నారాయణరాజు, సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

పుంగనూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో లీలామాధవి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బంది ఉదయాన్నే గ్రామాల్లోకి వెళ్లి కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రతిఒక్క కూలీ నుంచి ఆధార్, బ్యాంక్ ఖాతా నెంబరు, ఫోన్ నంబర్‌తో బీమా సౌకర్యం కల్పించేలా పని చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజుపేటలో శ్రీరామకోటి నామస్మరణ ప్రారంభం



రామకుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేటలోని కోదండరామ స్వామి ఆలయంలో బుధవారం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం ప్రారంభమైంది.బుధవారం ఉదయం 7 గంటలకు చెల్దిగానిపల్లెకు చెందిన రామకోటిరామన్న నేతృత్వంలో కలశస్థాపన, సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

## వ్యవసాయ యాప్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్

పుంగనూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాప్‌లపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఏడీఏ శివకుమార్ కోరారు. బుధవారం మేలుపట్లలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రతిభ కనబరిచిన రైతులకు ప్రభుత్వం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, మూడో బహుమతి రూ.8 వేలు ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నిరుపమ, రైతులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం శాంతిపురం మండలం చౌడంపల్లె, రాళ్లబూదుగూరు, తులసినాయనపల్లెలో టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ఆయన కడ పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించడమే కాకుండా శిక్షణానంతరం వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమలో ఎంపీడీవో కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు ఉదయ్‌కుమార్, విజయరామిరెడ్డి, ఆర్ఎస్ మణి, గోపాల్, శ్యామల, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి కృష్ణదాసనపల్లె జాతర

కుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం కృష్ణదాసనపల్లెలో వెలసిన ప్రసన్న గంగమాంబ, మారెమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఈనెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. 9న గంగ పూజ, ధ్వజారోహణం, అభిషేకం, తోమాల సేవలు అమ్మవార్లకు నిర్వహిస్తారు. రాత్రి శివపార్వతీ కల్యాణం, మారెమ్మ ఉత్సవం జరుగుతుంది. భక్తులకు అన్నదానం చేస్తారు. 10న అమ్మవార్లకు అభిషేకం, పలక వాద్యం, ప్రత్యేక అలంకరణ, తోమాల సేవలు నిర్వహిస్తారు. ఇదే రోజున అగ్నిగుండం, పచ్చి గెరిగె, పుష్ప పల్లకి, సయ్యాండి కార్యక్రమాలు జరుగుతాయి. వివిధ వేషధారణలతో భక్తులు అమ్మవారిని కొలుస్తారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. 11న అమ్మవార్ల జలావాస ఘట్టం జరుగుతుంది.

## ఆత్రేయ సమ్మేళనంలో కవులకు సన్మానం



సన్మానం అందుకున్న కవులు కొఠారి వెంకటరత్నం, గడ్డం శాంతకుమారి తదితరులు

వి.కోట, మే 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఆచార్య ఆత్రేయ 105వ జయంతి వేడుకల్లో భాగంగా భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో వి.కోటకు చెందిన కవులను సన్మానించారు. వి.కోటకు చెందిన కొఠారి వెంకటరత్నం, విశ్రాంత టీచర్ డా.జి.శాంతకుమారి 2025 ఆచార్య ఆత్రేయ అవార్డులను అందుకున్నారు.

## ఏఎంసీ చైర్మన్‌కు మాతృవియోగం



రాజమ్మకు నివాళి అర్పిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

సోమల, 7 (ఆంధ్రజ్యోతి): సోమల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఇరికిపెంట మాజీ సర్పంచ్ శ్రీనివాసులునాయుడు మాతృమూర్తి రాజమ్మ బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి బుధవారం ఇరికిపెంటకు చేరుకొని ఆమె మృతదేహానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడును పరామర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు బోస్, టీడీపీ నాయకులు రమేష్‌నాయుడు, శివశంకర్, మల్లికార్జున్, మహేంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు.

## మినీ కార్యకర్తలకు పదోన్నతి కల్పించాలి

పలమనేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ వర్కర్లను మెయిన్ అంగన్ వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించాలని ఏపీ ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ మినీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డీవీ మునిరత్నం ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న మినీ అంగన్‌వాడీ వర్కర్లు, మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని నిరంతరం పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తిస్తూ జీవో విడుదల చేయడం హర్షణీయమని తెలిపారు.

### మార్కెట్ కమిటీ పాలకవర్గం

# నియామకంలో ప్రతిష్టంభన..!



పలమనేరు మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం

పలమనేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంలో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని 10 మార్కెట్ కమిటీల్లో పాలక వర్గ నియామకానికి ఆయా శాసన సభ్యులు, మార్కెట్ కమిటీ ఉన్నతాధికారులు ఇచ్చిన రోస్టర్ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంలో మూడు నాలుగు మినహా మిగిలిన పాలక వర్గాలకు కమిటీ నియామకాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. పలమనేరు మార్కెట్ కమిటీకి పలమనేరుతో పాటు వి.కోటలోనూ అనుబంధ మార్కెట్ కమిటీ ఉంది. ఈ మార్కెట్ కమిటీకి తలసరి ఆదాయం రూ.3 కోట్లకు పైనే ఉంది. అంతేకాక పలమనేరు మార్కెట్ కమిటీని మోడల్ మార్కెట్ కమిటీగా అభివృద్ధి చేసేందుకు ఇక్కడి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి 2019 లోనే పలమనేరుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెంగళూరు, కుప్పం జాతీయ రహదారి కూడళ్ల వద్ద 50 ఎకరాల్లో మోడల్ మార్కెట్ కమిటీ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ మోడల్ మార్కెట్ కమిటీ నిర్మాణానికి కావలసిన అన్ని అనుమతులను ప్రస్తుతం తీసుకొచ్చే పనిలో అమరనాథరెడ్డి ఉన్నారు. దీంతో పలమనేరు మార్కెట్ కమిటీకి సమర్థవంతులైన వారిని మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా నియమించేందుకు జాప్యం చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే గతంలో ఈ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా పనిచేసిన వి.కోట మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ రామచంద్రనాయుడు పేరును తొలుత ప్రతిపాదించారు. అయితే ఆ తర్వాత ఆయన పేరును ప్రకటించలేదు. రోస్టర్ మేరకు పలమనేరు మార్కెట్ కమిటీ బీసీ మహిళకు కేటాయిస్తూ మార్కెటింగ్ శాఖ జిల్లా కలెక్టరుకు, ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. అయితే బీసీ మహిళ ఎవరు అన్న విషయమే కొలిక్కిరాక ప్రతిష్టంభన కొనసాగుతోంది. కొందరు ఎస్సీ టీడీపీ నాయకులు ఎన్నికల అనంతరం ఈ పదవిని ఆశించినప్పటికీ బీసీ మహిళ రిజర్వేషన్ అయిందన్న విషయంతో మిన్నకుండి పోయారు. ఇప్పటికే ప్రభుత్వం నాలుగు సార్లు మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకాన్ని ఖరారుచేసి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అయితే అందులో పలమనేరు మార్కెట్ కమిటీ పేరు రాకపోవడంతో ఆశావహులు నిరాశకు గురవుతున్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి ఏడాది పాటు కొనసాగుతుంది. అయితే ఏడాది పదవి ముగిసిన తరువాత మరో ఆరునెలల పాటు రెండోసారి పదవిలో కొనసాగేందుకు వెసులు బాటు కల్పిస్తుంది. ఇప్పటికే ఎన్నికలు జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో ఎవరికో ఒకరికి మార్కెట్ కమిటీ పదవి కట్టబెడితే రెండోసారి మరొకరికి ఈపదవి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వం ఎప్పుడు ఈ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

## నక్ష సర్వేకి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పక్కనే మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్

కుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ వి.సెల్వరాజ్ అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు 15 అంశాలతో కూడిన అజెండాను చదివి వినిపించారు. ఇప్పటికే ప్రారంభించిన నక్ష సర్వేని సమావేశం ఆమోదించింది. కౌన్సిల్ భేటీలో ఆమోదం పొందిన ఇతర అంశాలివే..!

- కుప్పం మున్సిపల్, 12వ వార్డు సచివాలయాలకు రోజూ అవసరమైన స్టేషనరీ కొనుగోలుకు ప్రతినెలా ఒక్కోదానికి రూ.12 వేలు కేటాయింపు.
- మున్సిపాలిటీలో మెరుగైన తాగునీటి సరఫరా, వీధి దిపాల నిర్వహణకు 2024 ఆగస్టు నుంచి తీసుకున్న 20 మంది అదనపు సిబ్బందికి ఆమోదం, 2026వ సంవత్సరం వరకు కొనసాగింపు. అలాగే పారిశుధ్య నిర్వహణ కోసం తీసుకున్న 33 మంది అదనపు సిబ్బందికి ఆమోదం, వీరి కనీస వేతనం రూ.15 వేలుగా నిర్ణయం.
- మున్సిపాలిటీ పరిధిలోని 27 రెవెన్యూ వార్డులకు సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్ ఇంటిగ్రేటెడ్ డిమాండ్ బిల్స్‌కు సంబంధించిన ప్రింటింగ్‌కు చేసిన ఖర్చు రూ.52,196 లకు ఆమోదం.
- డీకే.పల్లె పరిధిలోని మోడల్ కాలనీలో శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయింపు
- నైపుణ్యాభివృద్ధిలో భాగంగా నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి డ్రైవింగ్ స్కూల్ కోసం చిన్నకురబలపల్లెలో 5 సెంట్లు స్థలం కేటాయింపు.
- పురపాలక సంఘం పరిధి సామగుట్టపల్లె పరిధిలో ప్రభుత్వ సంక్షేమ ఎస్టీ బాలుర వసతి గృహం నిర్మాణం కోసం 46 సెంట్ల స్థలం కేటాయింపు.
- కుప్పం పురపాలక సంఘం పారిశుధ్య కార్మికుల కోసం కొబ్బరి నూనె, రిన్ సోపులు సరఫరా, పారిశుధ్య, నీటి సరఫరా అవుట్ సోర్సింగ్ సిబ్బంది సరఫరా కోసం రూ.4,21,512, రూ.4,20,750 విలువ గల రెండు వేర్వేరు టెండర్లకు ఆమోదం.
- ఈనెల 14 నుంచి 21 వరకు జరుగనున్న కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరకు భక్తులకు తాగునీటి సరఫరా, టాయిలెట్స్, పారిశుధ్య నిర్వహణ తదితర వసతుల కోసం రూ.42 లక్షలు మంజూరు.
- పురపాలక సంఘం పరిధిలోని 2వ వార్డు శీగలపల్లెలో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు.
- కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చే క్రమంలో 14వ వార్డులో కుమ్మరి ఆమగడ్డ నిర్మాణానికి రూ.40 లక్షలు, కుమ్మర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.1.15 కోట్లు, కొత్త షాదీ మహల్ నిర్మాణానికి రూ.3.65 కోట్లు మంజూరు.
- కుప్పం మున్సిపాలిటీకి రూ.92.20 కోట్లతో 9 అభివృద్ధి పనులు మంజూరు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో రూ.19 కోట్లతో సీసీ డ్రైన్ల నిర్మాణం, రూ.10 కోట్లతో వివిధ ట్రాఫిక్ కూడళ్లు, చెరువులు, డివైడర్ల సుందరీకరణ, రూ.3 కోట్లతో కృష్ణగిరి బైపాస్ రోడ్డులో గల శ్మశానంలో ఎల్పీజీ గ్యాస్ బేస్‌డ్ క్రిమిటోరియం ఏర్పాటు, రూ.3 కోట్లతో 25 వార్డుల్లో వీధి విద్యుద్దీపాల ఏర్పాటు, రూ.19 కోట్లతో డీకేపల్లె ఉద్యానవనం, ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఉద్యానవనం సుందరీకరణ, కడా కార్యాలయం పైన రూ.10 కోట్లతో రెండు అంతస్తులలో కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణం, రూ.22 కోట్లతో ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధి, రూ.70 లక్షలతో ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ పాఠశాలల వంటి ప్రభుత్వ భవనాలలో తాగునీటి లీకేజీ మరమ్మతుల వంటి ఎమర్జన్సీ పనుల నిర్వహణ, కడా కార్యాలయంలో పాలనా సంబంధమైన పనులు, నిర్వహణ, కన్సల్టెన్సీల కోసం రూ.5 కోట్లు చెల్లింపులు మొదలైనవి ఈ అభివృద్ధి పనుల్లో ఉన్నాయి.

## పారిశుధ్య కార్మికులకు పనిభారం

- మూడు నెలలుగా అందని జీతాలు
- పట్టించుకోని అధికారులు



పలమనేరులో వంద పడకల అధునాతన ఆస్పత్రి

పలమనేరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని వంద పడకల ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పనిభారంతో మనోవేదనకు గురవుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వీరికి గత మూడు నెలలుగా జీతాలు సైతం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేసేందుకు అధికారులు కాంట్రాక్టు పద్ధతిలో 18 మంది కార్మికులను నియమించుకున్నారు. ఇందులో ఒకరు సూపర్‌వైజర్ విధులు నిర్వర్తించగా.. మిగిలిన వారంతా పారిశుధ్య కార్మికులే. అయితే ఇందులో ఒకరిని దోబీగాను.. మరొకరిని కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా వినియోగించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవనాలు నిర్మించి ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. సువిశాలమైన భవనం నిర్మించినా పారిశుధ్య కార్మికుల సంఖ్య మాత్రం పెంచలేదు. గతంలో కేవలం 19 బాత్రూంలు, మురుగుదొడ్లు ఉండగా.. నేడు నూతన భవనంతో కలిపి మొత్తం 140కి పైగా బాత్రూంలు, మరుగుదొడ్లు ఉన్నాయి. అంతేకాకుండా గతంలో ఈ ఆస్పత్రిలో కేవలం 20 గదులు మాత్రమే ఉండగా.. నేడు వీటి సంఖ్య 90కి పైగా పెరిగింది. విశాలమైన గదులు, వరండాలు ఉన్నందున వాటన్నింటిని రోజూ శుభ్రపరచాలంటే వీరు కనీసం రోజుకు 14 గంటలకు పైగా పనిచేయాల్సి వస్తోంది. ఇకనైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి వీరికి వెంటనే చెల్లించాల్సిన మూడు నెలల జీతాలు చెల్లించడంతో పాటు ఆసుపత్రిలో అదనంగా మరో 20 మంది పారిశుధ్య కార్మికులను నియమించాల్సిన అవసరం ఉంది.

## కన్యకా పరమేశ్వరికి అభిషేకాలు




పాతపేటలో పూజలందుకున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారు

కుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం కొత్తపేట, పాతపేటల్లో వెలసిన కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

## వైభవంగా వాసవీ జయంతి



రామకుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ జయంతిని స్థానిక ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు, ఉత్సవమూర్తికి 102 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. ఉదయం 10.30 గంటలకు గణపతి, శివపార్వతి, మహావిష్ణు, నవగ్రహ హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.15 గంటలకు మహామంగళ హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి మంగళవాయిద్యాల మధ్య అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులిచ్చారు.



- పలమనేరు: పలమనేరులో బుధవారం వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, లలితా మహా హోమం, పూర్ణాహుతి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఆర్.వి.సుభాష్‌చంద్ర బోస్, సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజీ, అనుబంధ సంస్థలు, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన అధ్యక్షులు, సభ్యులు, పలమనేరులోని ఆర్యవైశ్య భక్తులు పాల్గొన్నారు.



### పుష్పపల్లకిపై వాసవీమాత విహారం



కల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు బజారు వీధిలో కొలువైన కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ మాత జయంత్యుత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. ఆలయంలో ఉదయం అమ్మవారికి రుద్రాభిషేకాలు, అర్చనలు ప్రత్యేకాలంకరణ నిర్వహించారు. పుష్పపల్లకిపై అమ్మవారు ఊరేగారు. వేడుకలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ జయంతి కమిటీ, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



- రొంపిచెర్ల: రొంపిచెర్ల బజారువీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పూజారి మునిరాజశర్మ పంచామృత అభిషేకాలతో పాటు పూజలు చేశారు.



- బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పుంగనూరులో...**



- పుంగనూరు: పట్టణంలోని బజార్ వీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి బుధవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కలశాలను తీసుకొస్తున్న యువతులు

- వి.కోట: వి.కోటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయాన్నే అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, పలురకాల అభిషేకాలతో పాటు గణపతి హోమం, దుర్గా హోమం నిర్వహించారు.

## నగరిని కమ్ముకున్న కారు మేఘాలు



నగరి పట్టణంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు కారు మేఘాలు కమ్ముకోవడంతో దట్టమైన చీకటి అలుముకుంది. స్థానికులు వింతగా వీక్షించారు. - నగరి, ఆంధ్రజ్యోతి

## ఆర్వోప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆర్వోప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

విజయపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్షూరికాపురంలో ఆర్వోప్లాంటును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే డి.గోపాల్‌రాజు జ్ఞాపకార్థంగా ఆయన తనయుడు మదన్‌గోపాల్‌రాజు గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకుగాను ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండల టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, సర్పంచ్ శేఖర్, నాయకులు గజేంద్ర నాయుడు, బాలాజీ, మురళీ నాయుడు, నారాయణరాజు, సుధాకర్ నాయుడు, రఘునాథరెడ్డి, మునిభాస్కర్‌రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారులు సహకరించాలి: డీఎస్పీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెదురుకుప్పం, మే 7(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారులు సహకరించాలని నగరి డీఎస్పీ సయ్యద్ మోహమ్మద్ అజీజ్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారమెప్పుడో?' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన నగరి డీఎస్పీ బుధవారం పచ్చికాపల్లంలో వ్యాపారులకు ట్రాఫిక్ సమస్యపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల ముందు ఆక్రమణలు, బోర్డుల పేరిట ఆక్రమణలు, వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలన్నారు. ఆక్రమణలను తొలగించి వాహన రాకపోకలకు సహకరించాలన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆశాలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

చిత్తూరు రూరల్, 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశా వర్కర్ల యూనియన్, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఎంహెచ్‌వో సుధారాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఆశాలకు ప్రకటించిన రాయితీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు నాగరాజు, మణి, మమత, హంస, భువన, కోకిల తదితరులు పాల్గొన్నారు.

## పెనుమూరులో భారీ వర్షం



తెగిపోయిన విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పెనుమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సకాలంలో ఏఈ తులసిప్రసాద్ తమ సిబ్బందితో కలిసి మరమ్మతులు నిర్వహించారు. వేసవిలో వర్షాలు విరివిగా పడుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో గాలికి మామిడి కాయలు నేల రాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వెదురుకుప్పం: కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో బుధవారం సాయంత్రం గాలివాన కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉక్కపోత పోసింది. సాయంత్రం గాలివాన మోస్తరుగా కురవడంతో వాతావరణం చల్లబడింది.

## సాయుధ తిరుగుబాటు వీరుడు 'అల్లూరి'



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్‌తో కలిసి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్. మూర్తి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● విజయపురం కూడలిలో వైసీపీ నాయకులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్‌యాదవ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగా ప్రతిభా పోటీలు

చిత్తూరు కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం సిద్ధ సమాధి యోగా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో బాలలకు యోగా ప్రతిభ పోటీలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ధ్యానం, ఆహారపు అలవాట్లు, ఏకాగ్రత, తదితర అంశాలపై ప్రతిభ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బాలలకు యోగా గురువులు నరేంద్ర కుమార్, బ్రహ్మయ్య, సుబ్రమణ్యంరెడ్డి, జగన్నాథ్ బహుమతులు అందజేశారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి గురుపూజోత్సవం

చిత్తూరు కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక తేనెబండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి గురుపూజోత్సవాన్ని నగర విశ్వ బ్రాహ్మణులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి గురు పూజ ఆరాధన చేశారు. విశ్వ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు

## దుకాణంలో చోరీ

చిత్తూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఓ దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు... పాత బస్టాండ్ పక్కనే శ్రీభగవాన్ ఎంటర్‌ప్రైజెస్ దుకాణం ఉంది. ఈ దుకాణంలో ఎలక్ట్రికల్ వస్తువులను విక్రయిస్తుంటారు. మంగళవారం రాత్రి షాపు యజమాని యథావిధిగా దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం వచ్చి చూడగా దుకాణం షట్టర్ తెరిచి ఉండటం, లోపల చిందర వందరగా వస్తువులు పడి ఉండటంతో దొంగతనం జరిగిందని గుర్తించి, వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు దుకాణాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘర్షణపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడిన సంఘటనపై ఒకటవ పట్టణ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. వెంగళరావుకాలనీలో సుగుణమ్మ కుటుంబం, పక్కనే హరీష్, రేవతి, రోసీలు ఉంటారు. ఈ నేపథ్యంలో పాతకక్షలను మనసులో పెట్టుకుని బుధవారం సుగుణమ్మను తిట్టడంతో ఘర్షణ మొదలైంది. దాంతో ఆమె కూడా ఎదురుతిరిగి మాట్లాడటంతో హరీష్, రేవతి, రోసీలు కలిసి సుగుణమ్మపై దాడి చేసి గాయపరిచారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎర్రగడ్డలు తరలించే ఆటో బోల్తా



వెదురుకుప్పం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలు తరలిస్తున్న ఓ ఆటో బుధవారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారిలో అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడులోని పళ్లిపట్టు నుంచి పుత్తూరుకు బుధవారం ఆటోలో ఎర్రగడ్డలను తరలిస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పుత్తూరుకు తరలించారని, డ్రైవర్ పేరు తెలియలేదని స్థానికులు తెలిపారు.

## ఆత్మహత్యకు ప్రయత్నించిన యువతి మృతి

బంగారుపాళ్యం, మే 7(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రయత్నించిన యువతి బుధవారం మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తుంబపాళ్యానికి చెందిన శశికళ(21) ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో సోమవారం పిడుదల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి వున్న ఆమెను కుటుంబ సభ్యులు తిరుపతి రుయాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

## ఎలుకల మందు తాగి ప్రైవేట్ స్కూల్ టీచర్ మృతి

చిత్తూరు అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్ మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లికి చెందిన వ్యాస్‌కుమార్ అక్కడే ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నాడు. అతడి భార్య మదనపల్లెలో మీనాక్షి ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ పని ఉందని చెప్పి వ్యాస్‌కుమార్ చిత్తూరు వచ్చాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలుకల మందు తాగడంతో గమనించిన స్థానికులు ఆయన్ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మదనపల్లి మీనాక్షి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా.. చికిత్స పొందుతూ మంగళవారం వ్యాస్ కుమార్ మృతి చెందారు. ఈ మేరకు మృతుడి భార్య సుహాసిని బుధవారం చిత్తూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## యాగ నిర్వహణ కమిటీ ఏర్పాటుకు ఎమ్మెల్యే గురజాల శ్రీకారం

చిత్తూరు కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండ రామాలయంలో రామాయణ యజ్ఞ మహా సామ్రాజ్య పట్టాభిషేక యాగ నిర్వహణకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం భక్తులతో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా ఆలయ అర్చకులు వేణుగోపాల్, ఈవో సుబ్రమణ్యం నాయుడితో పాటు బద్రీనాథ్, శ్రీధర్‌రావు, సంపత్‌కుమార్, శరవణ, సుధాకర్‌స్వామి, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, ద్వారకనాథ్, సతీష్‌కుమార్, అమరనాథ్, బద్రినాథ్, రామమూర్తి, రామభద్ర, కొత్తూరు బాబు తదితరులను సిఫారసు చేస్తూ ఎమ్మెల్యే దేవదాయ కమిషనర్‌కు ఆన్‌లైన్ ద్వారా కర్నూలు డీసీ కార్యాలయానికి పంపించారు. డీసీ వెంకటేశ్వర్లు వెంటనే ఎమ్మెల్యే ప్రతిపాదనను పరిశీలించి తగిన సమాచారం అందజేయాలని ఈవో సుబ్రమణ్యం నాయుడును ఆదేశించారు.

## నగరిలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు

నగరి, మే 7(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలో 29 వార్డులు ఉండగా.. ఇప్పటికే 16 వార్డులలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయని పరిశీలకులుగా వచ్చిన రాష్ట్ర ఎన్నికల క్షత్రియ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, పుత్తూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గణేష్ తెలిపారు. బుధవారం నగరి పట్టణంలో 25వ వార్డులో టీడీపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. నగరి మండల పరిధిలో దామరపాకం, టీవీ కండ్రిగ, కృష్ణాపురం,దేశవరం తదితర గ్రామాలకు చెందిన టీడీపీ సంస్థాగత ఎన్నికలను పరిశీలకులు రమేష్‌రాజు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ నిర్వహించారు.

## టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శిపై కేసు నమోదు చేయండి: వైసీపీ

నగరి, మే 7 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి ఆర్‌కే రోజాపైన, ఆమె కుటుంబసభ్యుల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగేలా అసత్య ఆరోపణలు చేసిన విజయపురం మండలానికి చెందిన టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ నగరి వైసీపీ నాయకులు బుధవారం సీఐ విక్రమ్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం ఆధ్వర్యంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బాలన్, గోపాల్‌రెడ్డి, మురుగ తదితరులు మాట్లాతూ ఆధారాలు లేకుండా గుణశేఖర్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కాగా తనపై, తన కుటుంబసభ్యులపై ఆరోపణలు చేసిన గుణశేఖర్‌రెడ్డిపై మాజీ మంత్రి ఆర్‌కే రోజా పరువు నష్టం దావా వేశారు.

## ఆలయ పాలక మండళ్ల ఏర్పాటుకు జీవో జారీ

చిత్తూరు కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగు ఆలయాలకు పాలక మండళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. కామాక్షి అంబికా సమేత అగస్త్యీశ్వరా, గిరింపేట చెంగల్‌రాయకొండ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి, తేనెబండ ముత్యాలమ్మ, మిట్టూరు సుందరవినాయక స్వామి ఆలయాలకు నూతన పాలక వర్గాల ఏర్పాటుకు జీవో విడుదల చేసింది.

## వైభవంగా అర్జున తపస్సు

పాలసముద్రం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణజిమ్మాపురంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సుమాను కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్జున పాత్రధారి భారతంలోని పద్యాలను పాడుతూ ఒక్కొక్కమెట్టు పైకెక్కి విభూది, నిమ్మపండ్లను విసిరారు. కోర్కెలు కోరే మహిళా భక్తులు కొంగుపట్టుకుని విభూది, నిమ్మపండ్లను దక్కించుకుని, తపస్సుమాను చుట్టూ తిరిగి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు.

# అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నాం

● పలు ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద

చిత్తూరు అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరును అభివృద్ధి చేయడమే తమ ప్రధాన అజెండా అని, రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే అభివృద్ధి పనులను పూర్తి చేసి చేతల్లో చూపించామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డుల్లో రూ.78.94 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మేయర్ అముదతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా చెంగల్రాయమిట్టలో సిమెంటు కాలువ, మురుగానిపల్లెలో నూతన బోరు మోటారు, మైత్రినగర్‌లో సిమెంటు రోడ్డు, ఎస్‌టీఐ కాలనీలో సిమెంటు కాలువ, జీకేపురంలో నూతన బోరు మోటారు, ప్రశాంత్‌నగర్, జీకే నగర్‌లో నూతన బోరు మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడే వారు గత పది నెలల్లో తాము చేసిన పనులను కళ్లు తెరిచి చూడాలన్నారు. కాగా 15వ వార్డులో నూతన బోరు మోటారును పారిశుధ్య కార్మికురాలి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. పలు చోట్ల స్థానిక నాయకుల చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, ఉమ్మడి పార్టీల నేతలు పాల్గొన్నారు.



తిరుపతి జిల్లా సత్యవేడు పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కు బుధవారం తిరుపతి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న చిత్తూరు, నగరి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, రాష్ట్ర ఎస్పీసెల్ ఉపాధ్యక్షుడు దశరథవాసు

## ప్రశాంతంగా యాదమరి గంగమ్మ నిమజ్జనం

● అలరించిన ఓంశక్తి భక్తుల విన్యాసాలు



యాదమరి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంగమ్మ జాతర నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. రెండ్రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో యాదమరి గంగమ్మ జాతర వేడుకలు జరుగగా బుధవారం రాత్రి గజమాలలు సమర్పించి, బాణసంచా వేడుకలు, ఓం శక్తి భక్తుల ప్రత్యేకపూజలు, విన్యాసాల నడుమ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాదమరి మండల యువత ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో భారీ గజమాలలు ట్రాక్టర్ మీద గ్రామంలో ఊరేగించి గంగమ్మకు సమర్పించారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయ భక్త బృందం సాయంత్రం పెద్దసంఖ్యలో ఓంశక్తి మాలలు ధరించి పూజలు చేసి పెద్ద ఇనుప కొక్కీలతో, నోట్లో శూలాలు వీపుపై గుచ్చుకొని, తాళ్ల సాయంతో గాలిలో తాడుపై వేలాడుతూ అమ్మవారికి మాల సమర్పించడం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మినీ లారీ, ఆటోలను ఓంశక్తి పరాశక్తి అంటూ లాగారు. అనంతరం పూజా కార్యక్రమాలు ముగించుకొని గంగమ్మను పెరుమాళ్ళపల్లి సమీపంలో నిమజ్జనం కోసం సిద్ధమవుతున్న సమయంలో వర్షం రాకతో జనం కొంత ఇబ్బంది పడ్డారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు పూర్తిచేశారు. వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్‌ఐ ఈశ్వర్ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

## రోగులకు పండ్ల పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, మే 7 (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లికి చెందిన ఎన్‌ఆర్ఐ ఎన్నీ విక్రమ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్నీ జయప్రకాష్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడాకారులకు రూ.4 లక్షల విలువ చేసే 40 క్రికెట్ కిట్లను ఎన్నీ జయప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, బిసి రవీంద్ర నాయుడు, హేమచంద్ర నాయుడు, లోకనాథ నాయుడు, రమేష్, హరిప్రసాద్, చందు, నవీన్, అభిమానులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరకులు అందలేదని ఫిర్యాదు

బంగారుపాళ్యం, మే 7(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో నిత్యావసర సరుకులు గత సంవత్సరం నుంచి సక్రమంగా అందడంలేదని మొగిలి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన లబ్ధిదారులు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బాబూ రాజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రతి నెలా బియ్యం తక్కువ వస్తోందని డీలర్ చెబుతున్నారని, దీనిపై అధికారులకు, ఎమ్మెల్యేకు విన్నవించామని తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంజునాథ్, ధనంజయనాయుడు, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గురునాథం నాయుడు

పూతలపట్టు, మే 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలో దాగివున్న నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వేము ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎం.గురునాథ నాయుడు అన్నారు. పి. కొత్తకోట సమీపాన గల వేము ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎంబీఏ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, కోళ్ల పెంపకం, ఇన్‌కంట్యాక్స్‌కు సంబంధించిన నిపుణులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ప్రొఫెసర్లు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## నేటి తరానికి మార్గదర్శకులు రామకృష్ణారెడ్డి



నివాళులర్పిస్తున్న ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ దొరస్వామి

వెదురుకుప్పం, మే 7(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదురైన కష్టాలను జయించి ముందుకు నడిచిన పద్మశ్రీ ఆచార్య బండి రామకృష్ణారెడ్డి నేటి తరానికి మార్గదర్శకులని ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య ఎం.దొరస్వామి అభిప్రాయపడ్డారు. బుధవారం వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన పెద్దకర్మకు హాజరయ్యారు.

## ప్రభుత్వ కళాశాలలే మిన్న

గుడిపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల కన్నా ప్రభుత్వ కళాశాలలే మిన్న అని బొమ్మసముద్రం కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరం నుంచి కళాశాలలో బైపీసీ కోర్సు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎంపీసీ, సీఈసీ, వొకేషనల్ కోర్సులు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డెప్ప, ఓబులేష్, జ్యోతి, సెల్వి, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై బీజేపీ హర్షం

చిత్తూరు సెంట్రల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఏప్రిల్ 22న పాకిస్తాన్ ప్రేరేపిత ఇస్లాం ఛాందసవాద ఉగ్రవాదులు అమాయక పర్యటకులపై దాడి చేయడం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి దీటుగా భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో వైమానిక దళం ఆపరేషన్ సిందూర్ పేరుతో మంగళవారం రాత్రి పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి మట్టుపెట్టడం హర్షణీయమని ఆ ప్రకటనలో తెలిపారు.

## పాక్‌పై దాడులు అభినందనీయం

గుడిపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): పాక్ తీవ్రవాద చర్యలకు బదులిస్తూ భారత్ చేసిన దాడులు అభినందనీయమని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత్‌తో పెట్టుకుంటే ఎలా ఉంటుందో పాకిస్తాన్‌కు అర్థమైందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌కు తగిన బుద్ధి చెప్పిందన్నారు.

## కోలాహలంగా గంగమ్మ జాతర



అగ్నితో సాహసాలు



సింహ వాహనంపై అమ్మవారు

వెదురుకుప్పం, మే 7(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం టీకేఎంపురంలో బుధవారం గంగమ్మ జాతర భక్తిశ్రద్ధలతో కోలాహలంగా జరిగింది. అమ్మవారిని సింహ వాహనంపై ఊరేగించారు. కోలాటం, భజనలు, అగ్నితో సాహసాలు వంటివి చేశారు. తోటివారుగా బొమ్మనదొడ్లకు చెందిన కొత్తపల్లి రాజేంద్ర కుటుంబీకులు వ్యవహరించారు. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు పర్యవేక్షించారు.

## ముగిసిన గంగమ్మ జాతర

వెదురుకుప్పం, మే 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట, సురేంద్రనగరం గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అంబళ్లు పోశారు. నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ఇంటింటి కర్పూర హారతుల కోసం ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు పర్యవేక్షించారు. కాగా, ఆర్కేవీబీపేటలో మంగళవారం గాలివాన వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం విద్యుత్ శాఖ దృష్టికి తీసుకెళ్లినా బుధవారం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆ గ్రామస్తులు తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

నింద్ర, మే 7(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు ఉన్నాయని జిల్లా ఉద్యానవశాఖాధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండలంలోని రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీపీ దీప, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, సర్పంచ్ వసంతబాబు రెడ్డి, రైతు నాయకులు వెంకటేశ్వర రావు, జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్, ఏవో తులసి, సిబ్బంది గాంధీ తేజ తదితరులు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం: ఆయిల్‌పాం సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్వేటినగరంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఉద్యోగులు, రైతులు హాజరయ్యారు.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తొలి శాఖను బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. స్థానిక నాయుడు బిల్డింగ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు స్టేట్ హెడ్ గోపి, జోనల్ హెడ్ వేణుగోపాల్ రాజు, చిత్తూరు మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ ఎన్నీ రామకృష్ణ, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే వారికే పదవులు

నింద్ర, మే 7(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడే వారికే పదవులు దక్కుతాయని నింద్ర మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని ఐఆర్ కండ్రిగ, ఎంఎస్‌పీఎం పురంలో సంస్థాగత ఎన్నికలపై సమీక్షా సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. నాయకులు రవి నాయుడు, బాబు యాదవ్, రఘు, నాగభూషణం రాజు, రవియాదవ్, తంగరాజ్, స్వయారాజ్, రవిరాజు, సుబ్రమణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

గుడిపాల, మే 7 (ఆంధ్రజ్యోతి): గుడిపాల ఎంపీడీవోగా శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమతి, రాష్ట్ర నాయకులు హేమాద్రినాయుడు, నాయకులు సుబ్బా నాయుడు, అర్జున్ గౌండర్, అరుణ్, శంకర్ చౌదరి, జయదేవ్ నాయుడు, విల్సన్, రాజ్‌కుమార్, శేఖర్ నాయుడు, రవి నాయుడు, శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు.